# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, దేశం సుభిక్షంగా ఉంటాయని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు.
- విశాఖలో ఋషికొండ బీచ్ కు బ్లూ ఫ్లాగ్ పునరుద్ధరణ పట్ల రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు.
- రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు రాత్రి విశాఖ నగరానికి చేరుకుంటారు.
- కాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

==================

ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, దేశం సుభిక్షంగా ఉంటాయని ఆశిస్తూ కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 2 కోట్ల 31 లక్షల రూపాయల నిధులతో నిర్వహించే పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. జల్ జీవన మిషన్ ద్వారా రాష్ట్రంలో 95 కోట్ల 44 లక్షల కుటుంబాలకు కుళాయిలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ బైట్..26 సెకన్లు)-పశ్చిమ గోదావరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని 2027 వరకు పొడిగించడంతోపాటు, కేంద్ర ప్రభుత్వాన్ని 55 వేలకోట్ల రూపాయలు కోరడం జరిగిందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన సొమ్మును 48 గంటల్లో చెల్లించి ఆదుకున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు.

==================

విశాఖలోని రుషికొండ బీచ్ కు బ్లూ ఫ్లాగ్ పునరుద్ధరణ పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన మొదటి ఎనిమిది బీచ్ లలో ఋషికొండ ఒకటని అన్నారు. రాష్ట్రంలో మరికొన్ని బీచ్ లకు ఈ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపామని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఋషికొండ బీచ్ లో నిరంతర భద్రత, పర్యావరణం, ట్రాఫిక్, నీటి శుద్ధి, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాగా.. రేపు ఉదయం 10 గంటలకు ఋషికొండ తీరంలో పర్యాటక శాఖ అధికారులు, బ్లూ ఫ్లాగ్ ప్రతినిధులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ బ్లూ ఫ్లాగ్ ను ఎగురవేస్తారు. ఇటీవల రుషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ హోదాను కోల్పోవడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి, చర్యలు చేపట్టారు. ప్రమాణాలకు అనుగుణంగా బీచ్ ను తీర్చిదిద్దడంతో తిరిగి బ్లూ ఫ్లాగ్ హోదా పునరుద్ధరించబడింది.

==================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు రాత్రి విశాఖ నగరానికి చేరుకుంటారు. రాత్రి 9 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, రుషికొండ వద్ద నున్న రాడిసన్ బ్లూ రిసార్ట్ లో బస చేస్తారు. రేపు సాయంత్రం 6 గంటలకు ఏసీఏ - విడిసీఏ స్టేడియంకు చేరుకుని ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ ను వీక్షిస్తారు. మ్యాచ్ అనంతరం ఋషికొండ రిసార్ట్ కి చేరుకుంటారు. మంగళవారం సాయంత్రం ఏడు గంటల 50 నిమిషాలకు విమానంలో విజయవాడకు బయలుదేరి వెళతారు.

===================

ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని, పది, ఇంటర్, డిగ్రీ అలాగే ఐటిఐ, డిప్లమో ఉత్తీర్ణులైన వారు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 500కు పైగా ప్రముఖ పరిశ్రమల్లో ఇంటర్న్ షిప్ పొందవచ్చునని సూచించారు. 21-24 సంవత్సరాల మధ్య వయసు కలిగి, కుటుంబ వార్షిక ఆదాయం 8 లక్షల రూపాయల లోపు ఉన్న నిరుద్యోగులు దీనికి అర్హులని తెలిపారు. ఏడాది పాటు జరిగే ఈ శిక్షణకు ఎంపికైన వారికి నెలకు 5 వేల రూపాయలు స్టైఫండ్ తో పాటు 6 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తారని కలెక్టర్ చెప్పారు.

===================

విరామం

===================

విశాఖ వేదికగా రేపు ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరగనున్న ఐపిఎల్ T20 క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం నుండి వచ్చే బస్సులు, ఇతర భారీ వాహనాలు పెందుర్తి, NAD మీదుగా నగరంలోకి చేరుకోవాలని సూచించారు. చిన్న వాహనాలు మారికవలస నుండి బీచ్ రోడ్డు మీదుగా హనుమంతవాక జంక్షన్ కు చేరుకోవాలని పేర్కొన్నారు. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే ప్రముఖులు, ప్రజలు అలాగే భద్రత కొరకు వచ్చే పోలీసులకు వేర్వేరు ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను కేటాయించామని, విభాగాల వారిగా వారికి కేటాయించిన స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

===================

రాష్ట్రంలో కాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ 4 కోట్ల మందికి కాన్సర్ స్కీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటింటికీ సర్వే చేస్తున్నట్లు వివరించారు. అనుమానితులకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నెట్ వర్క్ ఆసుపత్రుల ద్వారా చికిత్స అందిస్తున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్..35 సెకన్లు)-నెట్

అలాగే.. రానున్న ఆర్థిక సంవత్సరంలో పల్నాడు జిల్లాలో వైద్య కళాశాలను ఏర్పాటుచేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటుచేసిన వైద్యసదుపాయాలను మంత్రి ప్రారంభించారు.

===================

తిరుపతిలోని శ్రీనివాస క్రీడాసముదాయంలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని, నిర్దిష్ట సమయంలోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆధునికీకరణ పనులను ఈరోజు ఆయన పరిశీలించారు. సెలవుల సమయంలో వేసవి శిబిరాలు ప్రారంభించేనాటికి స్విమ్మింగ్ పూల్‌ను సిద్ధం చేయాలని, ఏప్రిల్ 10వ తేదీలోగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే స్మార్ట్ సిటీ నిధులతో క్రీడాసముదాయంలో చేపడుతున్న పనుల్లో నిలిచిపోయిన వాటిని గుర్తించి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

===================

అకాల వర్షానికి నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకుంటామని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా అరటి, ఇతర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

===================